క్లుప్తంగా

యునైటెడ్ క్యారల్స్ పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): నగరంలో శుక్రవారం నిర్వహించనున్న సింహపురి యునైటెడ్ క్యారల్స్ పోస్టర్లను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. ఇస్కాన్ సిటీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ చైర్మన్ అరుణ్ కుమార్, కన్వీనర్ జానీజో, సభ్యులు విద్యాధర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అటెండర్‌కు న్యాయం చేయాలని వినతి



ఆర్ అండ్ బీ ఎస్ఈకి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(బారకాసు): అటెండర్ పుట్టయ్యకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగ సంఘ నేతలు కోరారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ ఎస్ఈ గంగాధర్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. కాగా పుట్టయ్య పరిస్థితిని అర్థం చేసుకొని అతడ్ని సర్కిల్ కార్యాలయంలోనే నియమిస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు. ఆర్ అండ్ బీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ మస్తానయ్య, ఏపీజీఈఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ట్రెజరర్ మల్లిక, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

మనుబోలు: మండలంలోని కాగితాలపూరు, ఎల్ఎన్‌పురం గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ అధికారి శివకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ సమగ్రాభివృద్ధికి పాటుపడతామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, సీడీపీఓ విజయలక్ష్మి, ఏపీజీబీ జిల్లా కో–ఆర్డినేటర్ గురుస్వామి, కార్యదర్శి విమల తదితరులు పాల్గొన్నారు.

కవితల పోటీలు



మాట్లాడుతున్న నిర్వాహకులు

ఇందుకూరుపేట: సముద్రం అంశంపై కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు కవి, పోట్లూరు సాహిత్య వేదిక జాయింట్ సెక్రటరీ పేరిశెట్ల శివకుమార్ తెలిపారు. మండలంలోని మైపాడులో బుధవారం ఆయన వేదిక అధ్యక్షుడు పోట్లూరు సుబ్రహ్మణ్యంతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుబ్రహ్మణ్యం రచించిన సముద్రపు తీర కథల పుస్తకం వచ్చే ఏడాది జనవరి ఏడో తేదీన మైపాడులో ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో కవితల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 15 నుంచి 20 లైన్లలోపు కవిత ఉండాలన్నారు. పేరిశెట్ల శివకుమార్, మైపాడు గ్రామం, ఇందుకూరుపేట మండలం, నెల్లూరు జిల్లా – 524313 చిరునామాకు పోస్ట్ ద్వారా కవితను పంపాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు సుభద్రాదేవి, కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని చెల్లాయపాళెం గ్రామం పెద్దకాలువ వద్ద బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. దానిని పోస్టుమార్టం నిమి త్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్ర తెలిపారు.

ఆక్రమణలను వెంటనే తొలగించాలి

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): స్పందన కార్యక్రమంలో అందిన పలు ఫిర్యాదులను కమిషనర్ వికాస్ మర్మత్ క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. రామలింగాపురం పరిసర ప్రాంతాల్లోని రోడ్డు ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలో పారిశుధ్య పనులను వేగవంతం చేసి వరద ప్రభావిత ప్రాంతాల్లో బ్లీచింగ్, దోమల నివారణ చర్యలను చేపట్టాలని సూచించారు. ఏసీ కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో పోలీస్, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి పర్యటించి.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. రోడ్డు మార్జిన్ వ్యాపారులకు ప్రత్యేక సమయాలను కేటాయించాలని.. రోడ్డుపై కొంత పరిధి మేరకే వారు విక్రయాలు జరిపేలా ఆంక్షలు విధించాలని పేర్కొన్నారు. ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారాలను చూపి.. సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



సూచనలు చేస్తున్న వికాస్ మర్మత్

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

నెల్లూరు(లీగల్) : ఏపీ భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి బుధవారం ధర్నా చేపట్టారు. తొలుత జిల్లా కోర్టు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించారు. అనంతరం డీఆర్వో లవన్నకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ మాట్లాడారు. న్యాయ పరిజ్ఞానం లేని రెవెన్యూ సిబ్బందికి సర్వాధికారాలు ఇవ్వడం తగదన్నారు.
అనంతరం ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ మాట్లాడారు. కేసుల సత్వర పరిష్కారానికి గానూ ప్రతి మండలానికి కోర్టును ఏర్పాటు చేసి న్యాయవ్యవస్థను పటిష్టం చేయాలని కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

వీఎస్‌యూ అథ్లెటిక్స్ చాంపియన్‌గా 'డీకేడబ్ల్యూ'

నెల్లూరు (టౌన్): విక్రమ సింహపురి యూనివర్సిటీ స్థాయిలో కావలిలోని జవహర్‌భారతి కళాశాలలో నిర్వహించిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను డీకేడబ్ల్యూ విద్యార్థులు దక్కించుకున్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను బుధవారం అభినందించిన అనంతరం ప్రిన్సిపల్ గిరి మాట్లాడారు. 100, 200 మీటర్ల పరుగు, జావెలిన్‌త్రో, హైజంప్‌లో విద్యార్థి సుప్రియ ప్రథమ స్థానంలో నిలిచి ఏడు పతకాలను సాధించిందని చెప్పారు. డిస్కస్ త్రో, ట్రిపుల్ జంప్‌లో శ్రావణి ప్రథమ స్థానం.. అదే విధంగా 100, 400 మీటర్ల పరుగు, జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానాన్ని సాధించిందన్నారు. 1600 మీటర్ల పరుగులో రోస్లిన్ ప్రథమ.. లాంగ్ జంప్, హైజంప్‌లో ద్వితీయ.. ట్రిపుల్ జంప్‌లో తృతీయ స్థానాన్ని హరిప్రియ సాధించిందని పేర్కొన్నారు. పీడీ విజయకళ, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు రాజశేఖర్, ఉమామహేశ్వరి, దివ్య, తమన్నా, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ: నగరంలోని నెల్లూరు – 1, 2వ డిపోల పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వివిధ సమస్యలపై డిపో – 1 మేనేజర్ మురళీకృష్ణకు మూడు కాల్స్ వచ్చాయి. నెల్లూరు నుంచి ఉప్పలపాడుకు కొత్త బస్సులు నడపాలని.. ప్రయాణికుల సౌకర్యార్థం రాజుపాళెం నుంచి బస్సులను రెండు నిమిషాలు ఆపడంతో పాటు నెల్లూరు నుంచి చింతవరం వయా ముత్తుకూరుకు బస్సు నడపాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని మేనేజర్ హామీ ఇచ్చారు.

➡ నెల్లూరు నుంచి తిరుపతి నాన్‌స్టాప్ సర్వీసులకు నాలుగు గంటల సమయం పడుతోందని నెల్లూరు రెండో డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్‌కు ఫిర్యాదు అందింది. ఇందుకూరుపేటకు వెళ్లే బస్సులను వీఆర్సీ నుంచి కాకుండా ఆర్టీసీ నుంచి ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని ఓ వ్యక్తి కోరారు.



విద్యతో సంపూర్ణ వికాసం

నెల్లూరు(బృందావనం): విద్యతో సంపూర్ణ వికాసం సాధ్యమని నెల్లూరు జిల్లా సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ పిన్నక ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ ప్లస్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా కన్వీనర్ డొమినిక్‌రెడ్డి, అధ్యక్షుడు రమేష్‌బాబు, కోశాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పురమందిరంలో బుధవారం నిర్వహించారు. పదో తరగతి పరీక్షలను భయం లేకుండా ఎలా రాయాలి.. జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవడం .. తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లను అందజేశారు. సైకాలజిస్టులు సురేష్‌బాబు, రామ్‌కుమార్, రమణయ్య, విశ్రాంత అధికారులు నరసయ్య, నరసింహమూర్తి, మహ్మద్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

నేత్రపర్వంగా శతకలశాభిషేకం

నెల్లూరు(బృందావనం): మండల పూజలను పురస్కరించుకొని నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో శతకలశాభిషేకం, గురువాయూర్ మహావిష్ణుకు పుష్పాభిషేకాన్ని విశేషంగా బుధవారం నిర్వహించారు. కేరళ సంప్రదాయరీతిలో సుప్రభాతం, క్షీరాభిషేకం, గణపతి హోమం, ఉషఃపూజ, శత కలశార్చన, కలశ ప్రాకారోత్సవం తదితరాలను జరిపారు. ఉభయకర్తలుగా దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, నిర్మలమ్మ, శ్రీధర్‌రెడ్డి, సుప్రజ, వరిదిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, మైథిలీ, కాత్యాయని, హిమవంత్‌రెడ్డి వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి నిర్వాహకులు శేషగిరిరావు, వెంకటరత్నం, రత్నయ్య, మోహన్‌రావు, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని విజయవాడలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ, కేజీబీవీ, సమగ్రశిక్ష ఉద్యోగుల వేతనాల పెంపు తదితర అంశాలపై చర్చించారు.

రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి

కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి అందరికీ పోస్టింగ్‌లను ఇవ్వాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. కాంట్రాక్ట్ అధ్యాపకులకు సంబంధించిన జీఓ ఉత్తర్వులను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ నుంచి విజయవాడలో అందుకున్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల 20 ఏళ్ల నిరీక్షణకు తెరపడిందని, రెగ్యులరైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు 'కేఎన్నార్' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం విజయప్రకాష్

నెల్లూరు (టౌన్) : జాతీయస్థాయి యోగా పోటీలకు కేఎన్నార్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం విజయప్రకాష్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను బీవీనగర్‌లోని కేఎన్నార్ మున్సిపల్ హైస్కూల్లో బుధవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో నేషనల్ యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిది నుంచి 11 వరకు రాష్ట్రస్థాయి యోగా పోటీలను నిర్వహించారని, ఇందులో తమ స్కూల్ విద్యార్థులు సరయు, స్రవంతి, భువన కృతి, వంశీజస్వంత్, లోకేష్ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. పంజాబ్‌లో ఈ నెల 15 నుంచి 23 వరకు జాతీయ స్థాయి యోగా పోటీలను నిర్వహించనున్నారని పేర్కొన్నారు. స్కూల్ పీఈటీ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

భార్యపై దాడి

నెల్లూరు(క్రైమ్): విభేదాలతో భార్యపై భర్త దాడికి పాల్పడిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం మండలం కాశీపాళేనికి చెందిన చందన.. రేబాలకు చెందిన హరిబాబు నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఓ కుమార్తె ఉంది. హరిబాబు మరో మహిళతో సన్నిహితంగా ఉండటంతో దంపతుల నడుమ విభేదాలు పొడచూపాయి. తరచూ వీరు గొడవపడేవారు. ఈ క్రమంలో నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద నివాసం ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు చందన ఇటీవల వచ్చారు. ఈ తరుణంలో రంగనాయకులపేట నుంచి మంగళవారం ఆమె నడిచి వస్తుండగా, హరిబాబు దాడి చేసి గాయపర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై వేణుగోపాల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించరూ..



నెల్లూరు(వీఆర్సీసెంటర్): తమ సమస్యలను పరిష్కరించాలని ఎనర్జీ అసిస్టెంట్ గ్రేడ్ – 2 సిబ్బంది కోరారు. గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు తదితరులకు వినతిపత్రాలను బుధవారం అందజేశారు. నగరంలోని కోటమిట్ట సబ్‌స్టేషన్ ఏఈ అమానుల్లాకు వినతిపత్రాన్ని సమర్పించారు. అసోసియేషన్ నేత సాయివిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. అయ్యప్పస్వామి గ్రామోత్సవం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని వేడుకగా బుధవారం నిర్వహించారు. స్థానికంగా కొలువైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలను వెంకటేశ్వరపురం అయ్యప్ప భక్త బృంద ఆధ్వర్యంలో జరిపారు. అయ్యప్ప మాలధారులు చేపట్టిన భిక్ష కార్యక్రమం పూర్తయిన తరుణంలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సత్వరమే న్యాయం చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో తుఫాన్ బాధితులను సత్వరమే ఆదుకోవాలని తిరుపతి డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. వేదాయపాళెంలోని కిలారి వెంకటస్వామినాయుడు కల్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబాలకు రూ.ఐదు వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కనకట్ల రఘురామ్ ముదిరాజ్, చంద్రశేఖర్, పవన్‌కుమార్, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

నెల్లూరు రూరల్: దళితుల సంక్షేమం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో సాధ్యమైందని పార్టీ నేత స్వర్ణా వెంకయ్య పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్లో దళితులతో బుధవారం నిర్వహించిన మాటామంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ద్వారా మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ ఎస్సీ విభాగ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, దళిత నేత బెల్లంకొండ వెంకయ్య, నేతలు సునీల్, మురళి, సురేంద్రరెడ్డి, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్సీపీ లక్ష్యం



పార్టీ పతాకావిష్కరణ



53వ డివిజన్లో..

నెల్లూరు రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పేర్కొన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 17వ డివిజన్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. స్థానికులకు చేకూరిన లబ్ధిని వివరించే బోర్డును ఆవిష్కరించారు.
నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని పలు డివిజన్లలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని కార్పొరేటర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏడో డివిజన్లోని 7 / 3 జయప్రకాష్‌వీధి సచివాలయ పరిధిలో కిన్నెర మాల్యాద్రి.. 16వ డివిజన్ 16 / 1 ఆదిత్యనగర్ సచివాలయ పరిధిలో వేనాటి శ్రీకాంత్ రెడ్డి, 46వ డివిజన్ 46 / 2 కాపువీధి సచివాలయ పరిధిలో వేలూరు మహేష్, 53వ డివిజన్ 53 / 1 వెంకటేశ్వరపురం సచివాలయ పరిధిలో దేవరకొండ సుజాత ఆధ్వర్యంలో కార్యక్రమాలను జరిపారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధిని వివరించి.. పార్టీ జెండాలను ఆవిష్కరించారు.

సీతారామస్వామి మందిరంలో పూజలు



నెల్లూరు(బృందావనం): కార్తీక మాస ముగింపును పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతారామచంద్రులు, శివపార్వతులకు విశేష పూజలను బుధవారం నిర్వహించారు. విష్వక్సేన పూజ, హారతి, గంగామాతకు దీపాల సమర్పణను భక్తిశ్రద్ధలతో జరిపారు. మందిర కమిటీ నిర్వాహకులు వెంకటేశ్వర్లుగుప్తా, రత్నం, మస్తాన్‌రావు, అమరా మోహన్‌రావు, ఆంజనేయులు, శ్రీరామ్ వెంకయ్య, బొమ్మిశెట్టి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలని వినతి



జేసీతో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన జిల్లాలోని రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వినయ్‌నారాయణ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళనను బుధవారం చేపట్టిన అనంతరం జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, నేతలు వెంకయ్యనాయుడు, మురళి, మిడతల రమేష్, కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గుర్తింపు కార్డుల అందజేత



నెల్లూరు రూరల్: పోలీస్ శాఖ ద్వారా జారీ చేసిన గుర్తింపు కార్డులను పలువురు పాస్టర్లకు పడారుపల్లిలోని చర్చిలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య మాట్లాడారు. అనంతరం ప్రీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించి కేక్‌ను కట్ చేశారు. చెన్నైకు చెందిన రెవరెండ్ జాన్‌వెస్లీ, పార్టీ ఎస్సీ విభాగ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, దళిత నేత బెల్లంకొండ వెంకయ్య, పాస్టర్లు జోసఫ్‌బాబు, ఆనంద్‌రావు, ఫిలిప్స్, బెన్సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దళిత అధికారికి టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో బుధవారం వారు మాట్లాడారు. దళిత మహిళా అధికారిపై సోమిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. క్షమాపణలు చెప్పని పక్షంలో పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు. నేతలు వాసుదేవరావు, అంబేడ్కర్, ఉదయ్‌కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అధ్యయనోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో అధ్యయనోత్సవాలను భక్తిశ్రద్ధలతో బుధవారం ప్రారంభించారు. నవరత్న ఖచిత స్వర్ణవైరముడి సేవను విశేషంగా నిర్వహించారు. ఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.